క్లుప్తంగా...

నోడ్యూస్ సర్టిఫికెట్ కోసం ప్రొ.అన్సారీ దీక్ష

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.గణేష్ నో డ్యూస్ సర్టిఫికెట్ జారీలో వివక్షత చూపుతున్నారని విశ్రాంత అధ్యాపకులు ప్రొ.అన్సారీ ఆరోపించారు. సోమవారం ఆర్ట్స్ కాలేజీ ప్రవేశద్వారం



ఎదుట బైఠాయించి దీక్ష చేపట్టారు. ఆర్ట్స్ కాలేజీ లింగ్విస్టిక్స్ విభాగం నుంచి ఫిబ్రవరిలో ఉద్యోగ విరమణ చేసిన తనకు ప్రిన్సిపల్ ప్రొ.గణేష్ ఇంత వరకు నో డ్యూస్ సర్టిఫికెట్ ఇవ్వడం లేదని గత నెల (మే 30న) ఉద్యోగ విరమణ చేసిన వీసీ ప్రొ.రవీందర్‌పై విదేశీ విద్యార్థుల నిధులు దారి మళ్లించారని ఆధారాలతో సహా చూపినా నో డ్యూస్ సర్టిఫికెట్ ఇచ్చారని పేర్కొన్నారు. పదవులకు ఆశపడి వీసీ ప్రొ.రవీందర్ చెప్పు చేతల్లో పని చేస్తున్న ప్రిన్సిపల్ గణేష్‌కు నేను అన్ని సర్టిఫికెట్లను సమర్పించినా నో డ్యూస్ సర్టిఫికెట్ ఇవ్వకుండా ఐదు నెలలుగా కళాశాల చుట్టూ తిప్పిస్తున్నారన్నారు .నో డ్యూస్ సర్టిఫికెట్ లేకపోవడంతో ఇంత వరకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, పింఛన్ రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందుల పడుతున్నట్లు పేర్కొన్నారు. నేను గానీ., నా కుటుంబ సభ్యులుగాని అనుకోని సంఘటనలు చేసుకుంటే దానికి ఓయూ వీసీ ప్రొ.రవీదర్ బాధ్యుడని ప్రొ.అన్సారీ హెచ్చరించారు.

చిలకలగూడ డీఎస్‌ఐగా జ్ఞానేశ్వర్



చిలకలగూడ : చిలకలగూడ పోలీస్‌స్టేషన్ డిటెక్టివ్ సబ్ ఇన్‌స్పెక్టర్ (డీఎస్‌ఐ)గా జ్ఞానేశ్వర్ పదవీ బాధ్యతలు చేపట్టారు. ఏ ఎస్‌ఐ నుంచి పదోన్నతి పొందిన జ్ఞానేశ్వర్ ఈస్ట్‌జోన్ స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బీ)లో పనిచేసి పోలీస్ ఉన్నతాధికారుల మన్ననలు పొందారు. నేరాల నియంత్రణ, ని వారణకు సీసీ కెమెరాల ఏర్పాటు ఎంతో దో హదపడుతుందని, కాలనీ, బస్తీ సంఘాలు, వ్యాపార, వాణిజ్య సముదాయాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల యాజమా న్యాలతో సమావేశాలు ఏర్పాటు చేసి పలు అంశాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తామన్నారు.

దోస్త్ కాలేజీల జాబితాల్లో చేర్చండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో కొనసాగుతున్న నాన్ దోస్త్ కాలేజీలను దోస్త్ జాబితాలో చేర్చాలని ఆయా కాలేజీల ప్రిన్సిపల్స్, కరస్పాండెంట్స్ కోరారు. సోమవారం ఓయూ దూరవిద్య సెమినార్ హాల్‌లో రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి, వీసీ ప్రొ.రవీందర్ ఆధ్వర్యంలో నాన్ దోస్త్ కాలేజీల నిర్వాహకుల సమావేశం జరిగింది. నాన్ దోస్త్ జాబితాలోని 61 కాలేజీల్లో డిగ్రీ విద్యార్థులు చేరడం లేదని ఫీజుల విషయంలో కూడా దోస్త్, నాన్ దోస్త్ కాలేజీలకు నడుమ వ్యత్యాసం ఉందని, ఒకే ఫీజు విధానాన్ని అమలు చేయాలని కోరారు. నాన్ దోస్త్ కాలేజీ నిర్వాహకుల అభ్యర్థనను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లనున్నట్లు ప్రొ.లింబాద్రి పేర్కొన్నారు.

పకడ్బందీగా ఓటర్ల జాబితా

- కొనసాగుతున్న మార్పులు చేర్పులు
- పోలింగ్ కేంద్రాల సర్దుబాటు
- రాజకీయ ప్రతినిధులతో సమావేశాలు

సికింద్రాబాద్: శాసనసభ ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల విభాగం అధికారులు ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. ఓటర్ల జాబితాకు తుదిరూపు ఇవ్వడం కోసం కసరత్తులు, పోలింగ్ కేంద్రాల పరిశీలన కార్యక్రమాలు ముమ్మరం చేశారు. కొన్ని భవనాల స్థానంలో కొత్త పోలింగ్ స్టేషన్లకు సన్నాహాలు చేస్తున్నారు. ఇక్కడి పోలింగ్ కేంద్రాల్లో ఒక భవనం శిథిలావస్థకు చేరడం, ఒక భవనం మొత్తంగా నేలమట్టం కావడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్ల కోసం సన్నాహాలు చేస్తున్నారు. సీతాఫల్‌మండి ప్రభుత్వ పాఠశాలను నేలమట్టం చేయడం, తార్నాక సంఘీ పాఠశాల భవనం యజమానులు మారడం, లాలాపేట గడీ స్కూల్ శిథిలావస్థకు చేరడంతో ప్రత్యామ్నాయ కేంద్రాల ఏర్పాటు అవసరం అయింది. పోలింగ్ కేంద్రాలను సందర్శిస్తున్న బూత్‌లెవల్



ఆఫీసర్లు ఆయా పోలింగ్ కేంద్రాల స్థితిగతులను అధ్యయనం చేస్తున్నారు.

కొత్త మార్గదర్శక సూత్రాలు..

జాతీయ ఎన్నికల కమిషన్ అధికారులు తాజాగా రూపొందించిన మార్గదర్శక సూత్రాలను అమలు చేసే దిశగా సికింద్రాబాద్ సర్కిల్ ఎన్నికల అధికారుల కార్యాచరణ కొనసాగుతుంది. ఫొటో సిమిలారిటీస్ ఓటర్ల తొలగింపు. జాబితాలోని ఓటర్ల వివరాల నమోదులో సవరణలు చేస్తున్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులను ఆహ్వానించి సమావేశాలు నిర్వహిస్తూ ఓటర్లను అప్రమత్తం చేసి సవరణలు విజయవంతంగా పూర్తిచేసేందుకు సహకరించాలని కోరుతున్నారు. పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు సంబంధించి అభిప్రాయాలు, సలహాలు స్వీకరిస్తున్నారు. అదే విధంగా ఒకే ఇంటి నెంబర్‌తో ఎక్కువ సంఖ్యలో నమోదై ఉన్న ఓటర్లపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. వాస్తవంగా అవన్నీ అదే భవనంలో నివసిస్తున్న వారి వివరాలే అయితే ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు వేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. సరైన ఆధారాలు సమర్పించిన మీదట చిరునామాల మార్పిడి, మృతుల పేర్ల తొలగింపు వంటి చర్యలు పూర్తి చేస్తున్నారు.

తాజా పరిస్థితి..

సికింద్రాబాద్ నియోజకవర్గంలో 2023 ఏప్రిల్ వివరాల ప్రకారం 2,47,475 మంది ఓటర్లు ఉండగా ఇందులో 1,24,826 పురుషులు, 1,22,630 మంది మహిళలు, 19 మంది ఇతరులు ఉన్నారు. నియోజకవర్గంలో 98 భవనాల్లో 220 పోలింగ్‌బూత్‌లు ఏర్పాటు చేశారు. ఇందులో భవనాల కూల్చివేతల కారణంగా మూడు భవనాల్లోని 13 పోలింగ్ బూత్‌లకు ప్రత్యామ్నాయ భవనాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు.

రాజకీయ నేతలతో సమావేశం..

సికింద్రాబాద్: నియోజకవర్గ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సోమవారం ఎన్నికల అధికారి టీ.దశరథ్ సమావేశమయ్యారు. ప్రత్యామ్నాయ పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి సమావేశంలో చర్చించారు. పోలింగ్ కేంద్రాలు కలిగిన కొన్ని భవనాలు కూల్చివేయడం, మరి కొన్ని భవనాలు శిథిలావస్థకు చేరడంతో కొత్త భవనాల ఎంపిక కోసం రాజకీయ పార్టీల ప్రతినిధులు సమాచారం అందించాలని దశరథ్ కోరారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం అధికారులు హేమలత, చిత్ర, కే.భుజేందర్‌బాబు, వివిధ పార్టీల నాయకులు వల్లారం శ్రీనివాస్, రాజసుందర్, జలంధర్‌రెడ్డి, ప్రకాశ్, ప్రవీణ్, నర్సింగరావు పాల్గొన్నారు.



వివిధ పార్టీల నేతలతో చర్చిస్తున్న దశరథ్

అర్హులంతా ఓటు వేయాలి

నియోజకవర్గంలోని అర్హులైన వారి పేర్లన్నీ ఓటర్ల జాబితాలో చేర్చేలా విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండే విధంగా పోలింగ్ కేంద్రాలు ఎంపిక చేసి అవసరమైన వసతుల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేసుకుంటున్నాం. పకడ్బందీ ఓటర్ల జాబితా రూపకల్పన కోసం అన్ని రాజకీయ పార్టీల సహకారం తీసుకుంటున్నాం. ఓటర్లు కూడా జాబితాను పరిశీలించి నేరుగా లేదా ఆన్‌లైన్ ద్వారా సవరణలు చేసుకోవచ్చు.

–టీ.దశరథ్, ఎన్నికల అధికారి

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

అడ్డగుట్ట: అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కార్పొరేటర్ ప్రసన్న లక్ష్మి అధికారులను ఆదేశించారు. సోమవారం అడ్డగుట్ట బీ–సెక్షన్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు, మెట్లదారి పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో ఎప్పటికప్పుడు సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రానున్న కాలంలో మరిన్ని అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. పనుల్లో జాప్యం లేకుండా అధికారులు, కాంట్రాక్టర్లు వీలైనంత తొందరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్పొరేటర్ వెంట లింగాని శ్రీను, ఏతఃవిశ్వతేజ, నాయకులు సత్తయ్యగౌడ్, మనోహర్, వసంత, గౌస్, మహ్మద్, నర్సింగ్, రామస్వామి, గోపి, హరి, విమల, లక్ష్మి పాల్గొన్నారు.



మెట్లదారి మార్గాన్ని పరిశీలిస్తున్న ప్రసన్నలక్ష్మి

కూకట్‌పల్లిని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యం



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

సనత్‌నగర్: నిధులకు ఎలాంటి ఢోకా లేకుండా అభివృద్ధి పనులు నిరంతరాయంగా కొనసాగిస్తూ కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు.నియోజకవర్గ పరిధిలోని బేగంపేట డివిజన్‌లో శ్యాంలాల్ బిల్డింగ్, అల్లంతోట బావి ప్రాంతాల్లో రూ.1.69 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీరోడ్ల పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. బేగంపేట డివిజన్‌లో గత పాలకులు పరిష్కరించలేని దీర్ఘకాలిక సమస్యలను సైతం తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత పరిష్కరించడం జరిగిందన్నారు. డివిజన్ నుంచి ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే సత్వర పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి, నాయకులు శ్రీహరి, సురేష్‌యాదవ్, రాజయ్య, నరేష్ పాల్గొన్నారు.

పాఠశాలకు తాళం.. గేటు బయటే ఉపాధ్యాయులు

మధ్యాహ్నం తర్వాతే లోపలికి..

కంటోన్మెంట్: కరోనా సమయంలో పాఠశాలను మూసివేశారు. ఉన్న ముగ్గురు ఉపాధ్యాయులను సమీప పాఠశాలలకు డిప్యుటేషన్‌పై బదిలీ చేశారు. విద్యా సంవత్సరం ముగియడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఆ ఉపాధ్యాయులు పాత పాఠశాలకే రావాల్సి వచ్చింది. సోమవారం పునః ప్రారంభం కావడంతో పాఠశాలకు రాగా తాళం వేసి ఉండటంతో గేటు బయటే ఉండగా ఉన్నతాధికారుల చొరవతో మధ్యాహ్నం గేటు తాళం తీసుకుని లోపలికి వెళ్లారు.

ఇదీ జరిగింది..

తాడ్‌బండ్ చౌరస్తా సమీపంలోని ప్రాథమిక పాఠశాలలో ఆర్మీ స్థావరంలో కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేసే ఒరిస్సాకు చెందిన విద్యార్థులు మాత్రమే చదివే వారు. కరోనాకు ముందు 40 మంది విద్యార్థులు ఉండేవారు. కరోనాతో దాదాపు విద్యార్థులు రావడమే మానేయడంతో ఖాళీ అయింది. అక్కడి ముగ్గురిలో హరినాథ్ అనే ఉపాధ్యాయుడిని బోయిన్‌పల్లి హైస్కూల్‌కు డిప్యూటేషన్‌పై పంపారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు బ్లాండీనా అక్టోబర్‌లో పికెట్ స్కూలు, నవంబర్‌లో పరమేశ్వరి బోయిన్‌పల్లి ప్రైమరీ హైస్కూల్‌కు డిప్యుటేషన్‌పై బదిలీ అయ్యారు. తాజాగా నూతన విద్యాసంవత్సరం ఆరంభంతో 2న స్కూలును తెరిచేందుకు ఉపాధ్యాయులు తిరిగి తమ పాత పాఠశాలకు రాగా తాళం ఉంది. ఏడాది కాలంగా ఖాళీగా ఉన్న పాఠశాలను కొంతకాలం కంటోన్మెంట్ అధికారులు కోవిడ్ వ్యాక్సిన్ సెంటర్‌గా వినియోగించినట్లు తెలుసుకున్నారు. అనంతరం నూతనంగా మంజూరైన తాడ్‌బండ్ పోలీసు స్టేషన్ భవనం కోసం స్కూల్‌ను పోలీసు అధికారులు పరిశీలించినట్లు తెలిసింది. దీంతో ఉపాధ్యాయులు బోయిన్‌పల్లి పోలీసులను ఆశ్రయించగా తాము పరిశీలన మాత్రమే చేశామని, తమ ప్రతిపాదనకు విద్యాశాఖ ఒప్పుకోలేదని సమాధానం ఇచ్చారు. తాళం మాత్రం కంటోన్మెంట్ శానిటరీ సిబ్బంది వద్ద ఉండొచ్చని తెలిపారు. తాళం తొలగించేందుకు యత్నించగా కంటోన్మెంట్ సిబ్బంది అడ్డుకున్నారు. తమ అధికారులు చెబితేనే తాళం తీస్తామని చెప్పడంతో ఉపాధ్యాయులు కార్ఖానాలోని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ విజయ్ కుమార్‌ను సంప్రదించగా మధ్యాహ్నం తాళం తీశారు. ఉపాధ్యాయులు అయితే పాఠశాలలోకివెళ్లారు కానీ.. విద్యార్థులు లేకపోవడంతో సాయంత్రం వరకు ఉండి ఇళ్లకు వెళ్లిపోయారు.



తాళం వేసి ఉన్న స్కూలు ముందు ఉపాధ్యాయులు

రూ.80 లక్షలతో అభివృద్ధి పనులు

కంటోన్మెంట్: బోయిన్‌పల్లి మార్కెట్ యార్డులో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ శ్రీనివాస్ వెల్లడించారు. సోమవారం బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. యార్డులోని టాయిలెట్ల పునరుద్ధరణకు రూ.50 లక్షలు, బయోగ్యాస్ ప్లాంట్, దుకాణాల ముందు రేడియం స్టిక్కర్ల ఏర్పాటుకు రూ.30 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. నూతనంగా ఏర్పాటైన భరత్‌నగర్ (కూకట్‌పల్లి) కమిటీకి సిబ్బంది, ఆస్తుల విభజన చేపట్టినట్లు తెలిపారు. 38 మంది సిబ్బందిలో ఏడుగురిని కూకట్‌పల్లికి బదలాయించామన్నారు. 20 మంది సెక్యూరిటీ గార్డుల్లో ఆరుగురిని కూకట్‌పల్లికి కేటాయించామన్నారు. రూ.2.83 కోట్ల నిధుల్లో రూ.97 లక్షలు కూకట్‌పల్లికి అప్పగించామన్నారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ హారిక ఆనంద్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, సభ్యులు రామకృష్ణ, భాస్కర్, దేవులపల్లి శ్రీనివాస్, నారాయణ, గిరిధర్, శ్రీనివాస్ గౌడ్, షేక్ నయీమ్, సుశాంత్ రెడ్డి, భాస్కర్, జవహర్‌లాల్, శ్రీరాముల భాస్కర్, గౌతమ్ చంద్, పాల్గొన్నారు.



చైర్ పర్సన్‌కు మొక్క అందజేస్తున్న కమిటీ సభ్యులు

డ్రంకెన్ డ్రైవ్‌లో 8 మందికి జైలు

సనత్‌నగర్: బేగంపేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో ఎనిమిది మందికి జైలు శిక్ష విధించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తన సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టగా మొదటిసారి తాగి వాహనం నడుపుతున్న నలుగురితో పాటు రెండోసారి పట్టుబడ్డ మరో నలుగురికి జైలు శిక్ష, మరో ముగ్గురికి జరిమానా విధించారు.

యువకుడి అదృశ్యం



మణికాంత్

బౌద్ధనగర్: ఇంటి నుంచి వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన ఘటన వారాసిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది.ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. రాంనగర్‌లోని ఆశీర్వాద్ అపార్ట్‌మెంట్‌లో ఉండే ఎం.మణికాంత్ (21) ఈ నెల 11న ఇంటి నుంచి బయటకు వెళ్లి ఎంతకీ రాలేదు. కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. స్నేహితులు, బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో తండ్రి లక్ష్మీపతి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సమస్యల పరిష్కారానికి కృషి



హైదర్‌బస్తీ రైల్వే ట్రాక్ ప్రాంతంలో పర్యటిస్తున్న కిషన్‌రెడ్డి

బన్సీలాల్‌పేట్: రైల్వే ట్రాక్ పరిసర ప్రాంతాల ప్రజల సమస్యలను పరిష్కరించడానికి రైల్వే అధికారులు చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆదేశించారు. కార్పొరేటర్లు చీర సుచిత్రశ్రీకాంత్, కొంతం దీపికా నరేష్‌లతో కలిసి రాంగోపాల్‌పేట్ డివిజన్ రైల్వే ట్రాక్ పరిసర ప్రాంతాల్లో కేంద్ర మంత్రి పర్యటిస్తూ మాట్లాడారు. రైల్వే ట్రాక్, బ్రిడ్జిలు ఉన్న ప్రాంతాల్లో జరుగుతున్న పనులను వేగవంతం చేయాలని కోరారు. సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్మాణాత్మకమైన కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చీర శ్రీకాంత్, ప్రతాప్, శ్రీనివాస్, మోహన్, సిద్దంశెట్టి శ్రీనివాస్, సంతోష్, ఓంప్రకాష్, సంజయ్, సుభాష్ పాల్గొన్నారు.

ర్యాలీని విజయవంతం చేయాలి

అడ్డగుట్ట: 'మద్యం, మాదకద్రవ్యాల రక్కసి' నియంత్రణ కోసం నిర్వహించ తలపెట్టిన ర్యాలీని విజయవంతం చేయాలని ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధురాలు సువర్ణ ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొంత మంది మద్యం, మాదకద్రవ్యాలకు బానిసలుగా మారుతూ తమ ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారన్నారు. అలాంటి చెడు వ్యసనాలను నియంత్రించే దిశగా ఈ నెల 14న (బుధవారం) 'మద్యం, మాదకద్రవ్యాల రక్కసి' పేరుతో ర్యాలీని నిర్వహించనున్నట్లు తెలిపారు. బాలల హక్కుల పరిరక్షణ వేదిక, తెలంగాణ తల్లుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఉదయం 9.30 గంటలకు తుకారాంగేట్ చౌరస్తా నుంచి అడ్డగుట్ట అంజయ్య విగ్రహం వరకు ర్యాలీ ఉంటుందన్నారు.

పార్ట్‌టైం అధ్యాపకులను పర్మనెంట్ చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర వ్యాప్తంగా వివిధ వర్సిటీలలో పని చేస్తున్న పార్ట్‌టైం అధ్యాపకులను (పీటీఎల్) పర్మనెంట్ చేయాలని ఆయా వర్సిటీల వీసీలకు వినతి పత్రాలు ఇచ్చినట్లు ఓయూ పార్ట్‌టైం అధ్యాపకుల అసోషియేషన్ అధ్యక్షులు డా.సోమేశ్వర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం వీసీ ప్రొ.రవీదర్‌కు వినతి పత్రం ఇచ్చారు. తెలంగాణ మహిళ వర్సిటీ వీసీ ప్రొ.విజ్జులతకు పీటీఎల్ అధ్యక్షురాలు డా.వరలక్ష్మీ ఆధ్వర్యంలో పార్టుటైం అధ్యాపకులు వినతి పత్రాన్ని అందజేశారు.



'ఎఫ్‌ఓబీ' ఏర్పాటుకు కేంద్రమంత్రికి వినతి



వినతిపత్రం ఇస్తున్న రాజేశ్

సికింద్రాబాద్: మెట్టుగూడ కూడలిలో ఫుట్ ఓవర్ వంతెనను ఏర్పాటు చేయాలని బీజేపీ మెట్టుగూడ డివిజన్ అధ్యక్షుడు రాజేశ్ సోమవారం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఓ వైపు బస్టాపులు, మెట్రో స్టేషన్, ఫోర్‌వే రహదారితో ఎప్పుడూ సందడిగా ఉండే కూడలిలో పాదచారులు రోడ్డు దాటడం ఇబ్బందికరంగా మారిందని ఫలితంగా పలువురు ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నట్లు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారన్నారు.

తెరుచుకున్న పాఠశాలలు



మడ్‌ఫోర్ట్ పాఠశాల వద్ద ఉపాధ్యాయులు, విద్యార్థుల సందడి



పాఠశాలను సందర్శించిన కార్పొరేటర్ కొంతం దీపికా

బన్సీలాల్‌పేట్: పాఠశాలలు పునః ప్రారంభం కావడంతో విద్యార్థులతో కిటకిటలాడాయి. బన్సీలాల్‌పేట్, బోయిగూడ, భోలక్‌పూర్, హైదర్‌బస్తీ, రాణిగంజ్, గాస్‌మండి తదితర ప్రాంతాల్లోని పాఠశాలలకు పెద్ద ఎత్తున విద్యార్థులు తరలిరావడం కనిపించింది. భోలక్‌పూర్ క్రిష్ణానగర్‌లోని మేకలమండి పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు చాక్లెట్స్, పెన్సిళ్లు అందజేసి స్వాగతం పలికారు.

- మోండా మార్కెట్ డివిజన్ ఆదయ్యనగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను కార్పొరేటర్ కొంతం దీపికా సందర్శించి విద్యా బోధన గురించి ఆరా తీశారు. పాఠశాల పునఃప్రారంభం అయినా మన బడి–మన ఉరు కింద పాఠశాల నిర్మాణ పనులు నత్తనడక సాగుతుండటం పట్ల కార్పొరేటర్ అసహనం వ్యక్తం చేశారు. వెంటనే పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.

చప్పట్లతో విద్యార్థులకు స్వాగతం..

రసూల్‌పురా: పాఠశాలల పునః ప్రారంభంతో మడ్‌ఫోర్ట్ ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ప్రధాన గేటుకు మామిడి తోరణాలు, పుష్పాలతో అలంకరించారు. పాఠశాలకు వస్తున్న విద్యార్థులకు హెచ్‌ఎం సుప్రద ఐరీన్, ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు చప్పట్లు కొడుతూ చాక్లెట్లు పంచుతూ స్వాగతం పలికారు.ఉపాధ్యాయులు షెడ్రెక్, ఇందిరా, సుమతి, దేవేందర్ పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

సికింద్రాబాద్ మండలం పరిధిలోని గన్‌బజార్ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో 1–5 విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం అందజేశారు. బోయినపల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీఎస్ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

అన్ని వర్గాలకు సమన్యాయం

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. ఓల్డ్‌కస్టమ్స్‌బస్తీ ప్రాంతంలో ఖబ్రస్తాన్ కోసం రెండెకరాల స్థలాన్ని కేటాయించగా జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేష్‌కుమార్‌తో కలిసి మంత్రి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్‌బస్తీ ముస్లింల ఐదు దశాబ్దాల కల నెరవేరబోతుందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఈ ప్రాంతంలో అంత్యక్రియలు నిర్వహించేందుకు సరైన స్థలం లేక మృతదేహాలతో రోడ్లపై పెద్ద ఎత్తున ఆందోళనలు చేసిన సందర్భాలు అనేకం ఉన్నాయని గుర్తు చేశారు. గతంలో ఈ ప్రాంతం నుంచి ప్రాతినిధ్యం వహించిన ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి, మంత్రులుగా వ్యవహరించినప్పటికీ ఈ సమస్యను పరిష్కరించలేకపోయారన్నారు. అదేవిధంగా హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ అభివృద్ధి పనులకు అవసరమైన అన్నిరకాల అనుమతుల మంజూరు ప్రక్రియ 10 రోజుల్లో పూర్తవుతుందని స్కూల్ యాజమాన్యానికి వివరించారు. మంత్రి వెంట కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి, సిటీ ప్లానింగ్ ఆఫీసర్ దేవేందర్‌రెడ్డి, ఆర్డీఓ వసంతకుమారి, ఈఈ సుదర్శన్, పబ్లిక్ స్కూల్ వైస్ చైర్మన్ రఘురాంరెడ్డి, సభ్యులు ఫయాజ్‌ఖాన్, వినోద్, నాయకులు సలీంఖాన్, ఆరీఫ్, వహీద్, అబ్బాస్, అఖిల్ పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

ఆలయాల అభివృద్ధికి కృషి..

బన్సీలాల్‌పేట్: సనత్‌నగర్ నియోజకవర్గంలో దేవాలయాల అభివృద్ధి, పునర్నిర్మాణం కోసం కృషి చేస్తున్నట్లు మంత్రి శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. భోలక్‌పూర్ ప్రాంతంలో రేణుకా ఎల్లమ్మ దేవాలయం పునర్నిర్మాణ పనులకు సోమవారం ఆయన కార్పొరేటర్ కె. హేమలత, మాజీ కార్పొరేటర్ ఏసూరి సావిత్రిమహేష్‌లతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అనేక ప్రాంతాల్లో తన వ్యక్తిగత నిధులతో పలు దేవాలయాల నిర్మాణాన్ని చేపట్టినట్లు వివరించారు. గతంలో ఎన్నడూలేని విధంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం సమాజంలో అన్ని వర్గాల సంప్రదాయాలను గౌరవిస్తూ ముందుకు సాగుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలు పండుగలను గొప్పగా జరుపుకోవాలనే ఉద్దేశంతో పేదలకు ప్రభుత్వం తరపున కానుకలు అందిస్తుందన్నారు. రానున్న అమ్మవారి బోనాల వేడుకలు ప్రజలు ఘనంగా నిర్వహించుకోవడానికి వీలుగా దేవాలయాలకు ఆర్థిక సాయం అందజేస్తున్నామన్నారు. మతం పేరిట కొంత మంది ప్రజల మధ్య విద్వేషాలు సృష్టించి రాజకీయంగా పబ్బం గడుపుకోవడానికి ప్రయత్నించే వ్యక్తులు, శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పవన్‌కుమార్ గౌడ్, ఏసూరి మహేష్, ఎల్. వెంకటేష్‌న్, శ్రీకాంత్ రెడ్డి, డి. జనార్దన్, గురుమూర్తి, జహంగీర్, యశోద, లావణ్య వెంకట్‌ముదిరాజ్ పాల్గొన్నారు.



మంత్రి తలసానికి మంగళహారతులు, పువ్వులు చల్లుతూ ఘన స్వాగతం పలికిన స్థానిక మహిళలు

తీసుకున్న డబ్బులు ఇవ్వమన్నందుకు దాడి

అడ్డగుట్ట: అప్పుగా తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వమన్నందుకు ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు వివరాల ప్రకారం.. తుకారాంగేట్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం సమీప ప్రాంతానికి చెందిన సునీల్ స్థానికంగా ఛాట్ బండార్ దుకాణం నిర్వహిస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన గుడ్డు కుమార్ (24) అనే యువకుడికి కొన్ని నెలల క్రితం రూ. 40 వేలు అప్పుగా ఇచ్చాడు. ఈ నెల 11న తన డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగేందుకు గుడ్డు కుమార్ ఇంటికి సునీల్ వెళ్లగా మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. కూరగాయలు కోసే కత్తితో సునీల్‌పై దాడి చేయగా స్వల్ప గాయమైంది. వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గుడ్డు కుమార్‌పై కేసు నమోదు చేశారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.35, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 40, పచ్చిమిర్చి 55, బజ్జీమిర్చి 50, క్యాప్సికమ్ 55, పచ్చకాకర 38, పందిరి బీర 35, క్యాబేజీ 13, క్యారెట్ 53, దొండ 28, గుండుబీన్స్ 125, గింజ చిక్కుడు 85, గోకరకాయ 40, కీర 35, దోసకాయ 15, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 16, ఆలుగడ్డ 20, చామగడ్డ 35, మొరంగడ్డ 15, కందగడ్డ 40, సొరకాయ 13, పొట్లకాయ 13, అరటికాయ 10, మునగకాయ 3–4, ముల్లంగి 4–6. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.